# ఈ ఎన్నికలతో కాంగ్రెస్ కథ ముగిసినట్టే..

- బీజేపీ, ఇతర పార్టీల అడ్రస్ గల్లంతు ఖాయం
- బీఆర్ఎస్‌కు ఓటేసిన తర్వాతే అందరి తలరాతలు మారినయి
- మరోమారు గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసుకుందాం
- మంత్రి, బీఆర్ఎస్ సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- నాయీ బ్రాహ్మణులతో ఆత్మీయ సమ్మేళనం
- కాంగ్రెస్, బీజేపీ నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరికలు
- గులాబీ కండువా కప్పుకొన్న కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అరుణాప్రవీణ్


సూర్యాపేటలో నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, నవంబర్ 24 : ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లలో అన్ని రంగాలు ఎంతో అభివృద్ధి చెందాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. గడపగడపకూ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతుండటంతో ప్రజలంతా గులాబీ జెండాకు జై కొడుతున్నారని పేర్కొన్నారు. దీంతో సూర్యాపేటలో బీఆర్ఎస్ జన ప్రభంజనం కొనసాగుతున్నదని, ఈ ఎన్నికలతో కాంగ్రెస్ పార్టీ కథ ముగిసినట్టేనని చెప్పారు. బీజేపీ, ఇతర పార్టీల అడ్రస్‌లు గల్లంతు ఖాయమన్నారు. సూర్యాపేటలో శుక్రవారం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి మంత్రి సమక్షంలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. అదేవిధంగా నాయీ బ్రాహ్మణులు ఏర్పాటు చేసుకొని ఆహ్వానించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014 నుంచి బీఆర్ఎస్‌కు ఓటేసినంకనే అందరి తల రాతలు మారాయన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అరకొర సీట్లతో సరిపెట్టుకుని.. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన శాసన సభ ఉప ఎన్నికలన్నింటిలో చిత్తుగా ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ కథ ఈ ఎన్నికలతో ముగిసినట్టేనని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో రెండు సీట్లతో సరిపెట్టుకున్న బీజేపీ, ఎక్కడా బోణీ కొట్టని ఇతర పార్టీల అడ్రస్‌లు గల్లంతు కాక తప్పదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఎంతో మార్పు వచ్చిందని తెలిపారు. నిరంతర విద్యుత్, తాగు, సాగునీరు, ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా, దళిత బంధు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, అమ్మ ఒడి, కుల వృత్తులకు, చేతి వృత్తులకు చేయూత, సబ్సిడీ రుణాలు వంటి అనేక పథకాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పొందని ఇల్లు లేదని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి పథకాలు, అభివృద్ధి ఎందుకు లేవని ఓట్ల కోసం వస్తున్న ఆయా పార్టీల నాయకులను నిలదీయాలన్నారు. ప్రస్తుతం వారు అధికారంలో ఉండి అందించలేని పథకాలను కొత్తగా ఒక్క తెలంగాణ రాష్ట్రానికి ఇస్తామంటే నమ్ముతారా? అని ప్రశ్నించారు. మొన్న ఇదే తరహాలో కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు, నెరవేర్చలేని హామీలను నమ్మి మోసపోయిన కర్ణాటక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వింటే తెలుస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కరెంట్ పరిస్థితి ఎలా ఉన్నదో తెలుసుకోవాలని ప్రజలకు సూచించారు. తెలంగాణ మాదిరి అభివృద్ధి, సంక్షేమ పథకాలు యావత్ దేశంలోనే మరే రాష్ట్రంలో లేవన్నారు. రెండు మార్లు బీఆర్ఎస్‌కు ఓటేసినంకనే అందరి తల రాతలు మారి ప్రశాంత వాతావరణంలో నిరంతర అభివృద్ధి పాలన కొనసాగుతున్నదని చెప్పారు. అందుకే సూర్యాపేటలో ప్రజలంతా గులాబీ జెండాకు జై కొడుతూ.. అడుగడుగునా మంగళ హారతులతో బ్రహ్మరథం పడుతున్నారన్నారు. స్వచ్ఛందంగా ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకుని మద్దతు ప్రకటిస్తున్నారని తెలిపారు. ఇంతటి ప్రజాదరణను తట్టుకోలేకనే విపక్షాలు నెరవేర్చలేని హామీలతో దిక్కుతోచని స్థితిలో తిరుగుతున్నాయని ఎద్దేవా చేశారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి వారికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కారు గుర్తుకు ఓటేసి మరోసారి గెలిపిస్తే అన్ని రంగాలను మరింత అభివృద్ధి చేసుకుందామని కోరారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

సూర్యాపేట పట్టణంలోని 43వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ నామా అరుణా ప్రవీణ్, నామా సైదులు 160 మంది అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరారు. పెన్‌పహాడ్ మండలం లింగాల, పెన్‌పహాడ్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, సూర్యాపేట పట్టణం, ఆత్మకూర్ (ఎస్) మండలానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, చిరు వ్యాపారులు, యువత పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి జగదీశ్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో ఉన్నత విద్యామండలి మాజీ సభ్యుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, నాయకులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్, బీరవోలు శ్రీహర్ష, మర్ల చంద్రారెడ్డి, కొణతం సత్యనారాయణరెడ్డి, తూడి నర్సింహారావు, మామిడి అంజయ్య, దేవరకొండ జనార్దన్, వేణు, శ్రీను, శ్రీకాంత్, సైదులు యాదవ్, తాహెర్ పాషా, ఝాన్సీ రమేశ్ పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నాయీ బ్రాహ్మణులు

# ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటే దళితులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

- మంత్రి జగదీశ్‌రెడ్డిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించుకోవాలి
- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

బొడ్రాయిబజార్, నవంబర్ 24 : దళితులను ఆత్మ గౌరవంతో నిలబెట్టడమే లక్ష్యంగా పూలే, అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి దళితులు మద్దతుగా ఉన్నట్లు టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ తెలిపారు. సూర్యాపేట బీఆర్ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు దళితులను చిన్న చూపు చూశారని, దళితుల అభ్యున్నతికి ఏ పథకమూ తీసుకురాలేదని అన్నారు. దళితులను ఉన్నత స్థాయిలో చూడాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ దళిత బంధు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దళితులను ఓటు బ్యాంక్‌గా వాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తున్నదని, ఆ పార్టీని నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పల్లేటి లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు కనుక జానయ్య, దుబ్బ రమేశ్, నియోజకవర్గ ఇన్‌చార్జి పాలడుగు పరశురాములు, పట్టణ అధ్యక్షుడు సాయి పాల్గొన్నారు.

# గుట్టలో సుదర్శన నారసింహ హోమం

యాదగిరిగుట్ట, నవంబర్ 24 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి సుదర్శన నారసింహ హోమం పాంచరాత్రాగమశాస్త్రరీతిలో సాగింది. శుక్రవారం ఉదయం ఆలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ సుదర్శన నారసింహ హవనం జరిపారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహన సేవ చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం జరిగింది. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల తిరువీధి, దర్బార్ సేవల్లో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు వైభవంగా జరిగాయి. కార్తీక మాసం సందర్భంగా కొండ కింద వ్రత మండపంలో సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి

# పెన్‌పహాడ్‌లో కాంగ్రెస్ ఖాళీ

- ఎప్పుడో తోక ముడిచిన బీజేపీ
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి

పెన్‌పహాడ్, నవంబర్ 24 : సూర్యాపేట నియోజకవర్గంలో కొద్దో గొప్పో కాంగ్రెస్‌కు ఊపిరిగా ఉన్న పెన్‌పహాడ్ మండలంలో ఇప్పుడు ఆ పార్టీ ఖాళీ కాగా బీజేపీ ఎప్పుడో తోక ముడిచిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు సూర్యాపేటలో మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. చేరికలపై మండలంలోని అనంతారంలో నర్సింహారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంతో పాటు, లింగాల, పొట్లపహాడ్, గూడెపుకుంటతండా తదితర గ్రామాల నుంచి కాంగ్రెస్‌కు చెందిన సర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరడంతో స్థానికంగా కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ అయిందన్నారు. ఇక బీజేపీ కమలం రెమ్మలు తెగిపడడంతో ఎప్పుడో తోక ముడిచిందని తెలిపారు. మంత్రికి మద్దతుగా పార్టీలకు అతీతంగా గులాబీ గూటికి వస్తుండడం శుభ పరిణామం అన్నారు. సూర్యాపేట నియోజకవర్గం గత పాలకుల చేతిలో చీకటిమయంగా ఉంటే జగదీశ్‌రెడ్డి రాకతో సుందరవనంగా మారిందని తెలిపారు. సీఎం కేసీఆర్ మంత్రి జగదీశ్‌రెడ్డికి బీం ఫామ్ ఇచ్చినప్పుడే గెలుపు ఖాయమయిందని ఇప్పుడు మెజార్టీ దిశగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు ఓటు కోసం వెళ్లడానికి మొఖం చెల్లడం లేదన్నారు. అందుకు కారణం ఆనాడు దామోదర్‌రెడ్డి గ్రామాలను దత్తత తీసుకుని తట్టెడు మట్టి పోయకపోవడమే కారణమన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పారదర్శక పాలన వల్లే జరుగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ సాధించడం తథ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగేంధర్, జిల్లా నాయకులు మామిడి అంజయ్య, అనంతుల శ్రీనివాస్, నారాయణ, శ్రీధర్‌రెడ్డి, జూలకంటి వెంకట్‌రెడ్డి, మామిడి వెంకటయ్య, సూదిరెడ్డి సత్యనారాయణరెడ్డి, షరీపుద్దీన్, మాధవరావు, గద్దల నాగరాజు, కట్ల నాగార్జున, సురభి వెంకటేశ్వర్లు, రణపంగ తిరపతయ్య, వెంకన్న పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే నాగార్జునసాగర్ అభివృద్ధి

- ఆ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్


బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, నవంబర్ 24 : నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమైందని ఆ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. పెద్దవూర మండలం పెద్దగూడెం, కేకేతండాకు చెందిన 35 కాంగ్రెస్ కుటుంబాలు శుక్రవారం హాలియాలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నట్లు తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి 24 గంటల కరెంటు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, దళితబంధు, బీసీ బంధు, ఆరోగ్యలక్ష్మి వంటి కార్యక్రమాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేవన్నారు. మూడోసారి అధికారంలోని వచ్చాక రైతుబంధును రూ.16 వేలకు పెంచడంతో పాటు 400 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందజేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 30న జరిగే శాసన సభ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవినాయక్, ఆయా గ్రామాల సర్పంచులు మల్లారెడ్డి, శంకర్‌నాయక్, రవి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, మోహన్, డాకు, చందు, శివ, శ్రీను, శ్రవణ్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.